పేదల ఇళ్ళ సమస్య పరిష్కారమయ్యే వరకూ సీపీఐ పోరు

సీపీఐ నాయకులు లక్కోజీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర–సారవకోట : టిడ్కో జగనన్న కాలనీల ఇళ్ళ లబ్ధిదారుల సమస్యల పరిష్కారం అయ్యే వరకూ లబ్ధి దారుల పక్షాన సీపీఐ ఉమ్మడి పోరాటాలు చేస్తుందని సీపీఐ నాయకులు లక్కోజీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామం లో శుక్రవారం లబ్ధిదారులను కలిసి మహా ధర్నా గోడ పత్రికను గ్రామాల్లో అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ లో ఇల్లు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇస్తున్న రూ. 1.80 లక్షలు పునాది కర్చులకు కూడా సరిపోవు అని, ప్రభుత్వమే ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇచ్చి కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు. లబ్ధిదారులు అప్పులు చేసి కట్టుకుంటున్నారని ప్రభుత్వం ఇళ్ళ సముదాయాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇళ్ళ సమస్యలమీద ఈనెల 30న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తామని, లబ్ధిదారుల సంతకాలతో కూడిన వినతి పత్రాలు ఇస్తామన్నారు. ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే ఫిబ్రవరి 22న విజయవాడలో మహా ధర్నా నిర్వహిస్తామని ఈ కార్యక్రమాలలో లబ్ధిదారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బొమ్మాలి సూర్య నారాయణ, సహాయ కార్యదర్శి చూపర్ల నారాయణ, సీపీఐ నాయకులు చొప్పర్ల లవకుమార్, వెంకటరావు, పాగోటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజును కలిసిన సాధన సమితి నాయకులు

విశాలాంధ్ర–అరసవల్లి: అనంతపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న ప్రత్యేక హోదా సమరయాత్ర సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజును కలిసి బస్సు యాత్రలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీని పాల్గొనవలసిందిగా వారు కోరారు. ఈ విషయమై గిడుగు రుద్రరాజు కాంగ్రెస్ పార్టీ జిల్లా శ్రేణులకు బస్సు యాత్రలో పాల్గొవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. నర్సునాయుడు, చాపర వెంకటరమణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కె. ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నిజరూపం

- హోట్ట హాసంగా ప్రారంభమైన రథసప్తమి వేడుక
- పటిష్ట ఏర్పాట్లు చేసిన జిల్లా అధికార యంత్రాంగం
- 1200 మంది పోలీస్‌లతో బందోబస్తు

విశాలాంధ్ర –శ్రీకాకుళం: ఆరోగ్య ప్రదాత, వెలుగుల రేడు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకలు శుక్రవారం అర్ధ రాత్రి ప్రారంభమయ్యాయి. విశాఖ శారదా పీఠం ఉత్తరాదికారి స్వామీ సాత్మా నాందేంద్ర స్వామి తొలి పూజల అనంతరం భక్తులకు స్వామి వారు దర్శనం కి అనుమతించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ తరుపున స్వామి వారికి పట్టు వస్త్రాలు అందించారు. సూర్య జయంతి నీ పురస్కరించుకొని మాగ శుద్ధ సప్తమి నాడు ఏటా ఈ రథ సప్తమి వేడుకలు నిర్వహిస్తారు. శని వారం రథసప్తమి పురస్కరించుకుని తొలి పూజ అంతరం ఉదయం 6 గంటల వరకూ క్షీరాభి సేకం నిర్వహిస్తారు. అంతరం స్వామి వారి నిజరూపం దర్శనం. స్వామి నిజరూపం చూస్తే సమస్త పాపాలు పోయి మంచి ఆరోగ్యం కలుగుతుంది అనే నానుడి ఉంది. భక్తులు శుక్రవారం సాయంత్రం నుంచే క్యూలైన్ లో కి చేరుకొని వేచి ఉండి ప్రారంభ సమయం లో స్వామి వారు దర్శనం చేసుకుంటారు. అరసవల్లి దేవస్థానం వద్ద క్షీరన్నం వండి మొక్కులు తీర్చుకుంటారు. రథ సప్తమి వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారు. ఇంత ప్రసిద్ధి ఉన్న ఈ వేడుకల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ శ్రీ కేశ్ లాత కర్, జిల్లా ఎస్పీ జీ ఆర్ రాధిక, దేవాదాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లు ను పరిశీలించి అధికారులకు పలు సూచ నలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. 1200 మంది పోలీస్ కు ఈ వేడుకల్లో విధులు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం ఆర్ టీ సీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. నగరంలో ట్రాఫిక్ నిబంధన లు చేసి వాహనాలు పార్కింగ్ కి ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. అర్ధ రాత్రి నుంచి ప్రారంభ మైన వేడుకల్లో పలువు రు ప్రముఖులు స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

దీనావస్థలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

విశాలాంధ్ర–మందస : మండలం బుడంబో గిరిజన గ్రామంలోఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల దీనావ్యవస్థలో ఉంది. సంబంధిత అధికార యంత్రాంగం ఈ పాఠశాలను గాలికి వదిలేయడంతో ఈ దుస్థితి ఏర్పడింది. తరుచు ఈ పాఠశాల అవినీతి, అక్రమాలకు వేదికగా తయారైంది. ఇటీవల ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సస్పెండ్ అయ్యాడు. ఒక సిఆర్‌టిని తొలగించారు. ప్రస్తుతం పాఠశాలలో హెచ్.ఎం కూడా పది రోజులు నుంచి దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. ఆయన స్థానంలో ప్రత్యామ్నాయంగా ఇన్‌చార్జ్ హెచ్.ఎంను నియమించ కుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. మందస సహాయ గిరిజన సంక్షేమాధికారి కార్యాలయం పరిధిలో ఆశ్రమ పాఠశాల ఉంది. సుమారు 150 మంది గిరిజన బాలికలు చదువుతున్న ఈ పాఠశాలలో సబ్జెక్టు వారిగా ఉపాధ్యాయులు లేరు. బాలికలకు బోధన కూడా సక్రమంగా జరగడం లేదన్న ఆరోపణ లున్నాయి. ప్రధానోపాధ్యాయుడుతో పాటు రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకుండా ఈ పాఠశాల నడప డం పట్ల గిరిజనులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. శిక్ష ణమే ఆశ్రమ పాఠశాల కోసం పట్టించుకోవాలని ఐటిడిఎ అధికారికి బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసాపత్రం అందుకున్న ఏఈ శ్రీనివాస్ సాహుకు

విశాలాంధ్ర–సరుబుజ్జిలి : ఏపి ఈపిడిసిఎల్‌లో ఉత్తమ సేవలు అందించినందుకుగాను సరుబుజ్జిలి ఏఈ జి.శ్రీనివాస్ సాహుకి గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్టణం లో ఏపిఈపిడిసిఎల్ సిఎండి సంతోష్ చేతులమీదగా గురువారం ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. సరుబుజ్జిలి మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది ఏఈ శ్రీనావాస్ సాహుని అభినందించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ అవార్డు వచ్చినందుకు గర్వాంగా ఉందని. ఈ జోస్తో మరింత మెరుగ్గా విధులు నిర్వహిస్తామని అన్నారు.

లారీ ఢీకొని విద్యుత్ స్తంభం ధ్వంసం

విశాలాంధ్ర–వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఇసుక లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీ కొనడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే గురుకుల పాఠశాల ప్రహరీగోడను ఢీ కొని కొబ్బరిచెట్టు మీదుగా వెళ్లడంతో చెట్టు విరిగిపోయింది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగక పోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

శ్రీకాకుళం జిల్లాకు 126 పోస్టులు

విశాలాంధ్ర–జలుమూరు : దేశవ్యాప్తంగా 40,889 ఉద్యోగాల భర్తీకి పోస్టల్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 126 ఉద్యోగాలు భర్తీ కానున్నాయి. వీటిలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ వంటి ఉద్యోగాలు ఉన్నాయి. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ ఉద్యోగాలకు అర్హులు. నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీఎస్:// ఇండియాపోస్ట్‌జీడీఎస్‌ఆన్‌లైన్) సంప్రదించాలి సంప్రదించాలి.

ప్రజల విముక్తి కోసమే లోకేష్ పాదయాత్ర

సంఘీభావ పాదయాత్రలో స్వల్ప ఉద్రిక్తత

విశాలాంధ్ర–పలాస : రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ నుంచి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని, వారి విముక్తి కోసమే తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర ప్రారంభించారని మాజీ మంత్రి గౌతు శివాజీ అన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా శుక్రవారం పలాస టీడీపీ ఆధ్వర్యంలో సంఘీభావ యాత్ర చేపట్టారు. అనంతరం సర్దార్ గౌతు లచ్చన్న, ఎన్‌టిఆర్, మహాత్మగాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మూడు రోడ్ల జంక్షన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యులు బ్రతకడం నష్ట తరంగా మారిందని, ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు చెప్పేందుకే లోకేష్ పాదయాత్ర ప్రారంభించారని అన్నారు. ప్రజల పక్షాన టీడీపీ ఎల్లప్పుడు ఉంటుందని, 400 రోజులు పాటు రోజుకు పది కిలోమీటర్లు చొప్పున 4వేల కిలోమీటర్లు పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి మూడు రోజులు పాదయాత్ర చేసి ఆపి మళ్లీ చేయడం వంటి పరిస్థితి నారా లోకేష్‌కు రాదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్, టీడీపీ నాయకులు గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, టి.ఢిల్లీరావు, కుత్తుం లక్ష్మణకుమార్, బి.నాగరాజు, ఎస్.నవీన్, ఎల్.రుద్రయ్య, దుర్యోదన, సూరాడ మోహనరావు, రట్టి లింగరాజు, జె.రమణ, శశిభూషణ్, బి.క్రిష్ణరాజు, విజయకుమార్‌లతో పాటు అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రలో స్వల్ప ఉద్రిక్తత: పలాస టీడీపీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే శివాజీ నాయకత్వంలో చేపట్టిన లోకేష్ సంఘీభావ యాత్రలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. టీడీపీ నాయకులు పలాస టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వరకు వచ్చే సరికి పాదయాత్ర డి.జె అనుమతి లేదని, కాశీబుగ్గ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులతో వాగ్వివాదానికి దిగగా చివరకు తోపులాటకు దారి తీసింది. వాస్తవానికి టీడీపీ కార్యాలయం నుంచి పద్మనాభపురం వరకు పాదయాత్ర చేయాల్సి ఉన్నప్పటికీ పోలీసులు అనుమతించకపోవడంతో మూడు రోడ్ల జంక్షన్ నుంచే టీడీపీ నాయకులు వెనుదిరిగారు.

మిసెస్ ఇండియా పోటీలకు పైడి రజని

29 నుంచి రాజస్తాన్‌లో గ్రాండ్ ఫినాలే

విశాలాంధ్ర–శ్రీకాకుళం రూరల్: ఈనెల 29 నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం సిటీ ఆఫ్ టైగ్రెసెస్ రంతంబోర్ ప్రాంతంలో జరుగునున్న మిసెస్ ఇండియా గ్రాండ్ ఫినాలే పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ స్కాలర్, మిసెస్ ఎపిఎస్ కళాశాల ఇంగ్లీష్ హెడ్‌ఫోడీ, శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవ) అధ్యక్షురాలు పైడి రజని హాజరుకానున్నారు. గత ఏడాది మిసెస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టైటిల్ గెల్చుకున్న ఈమె రాజస్థాన్లో జరుగుతున్న జాతీయస్థాయి మిసెస్ ఇండియా పోటీలకు ఫైనలిస్ట్ గా ఎంపికయ్యారు. ఈనెల 29 నుండి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నాలుగు రోజులు పాటు జరుగనున్న పోటీల్లో వివిధ కేటగిరీల్లో ఎంపిక కావాల్సి ఉంటుందన్నారు. శాస్త్రీయ నృత్యం, ప్రాంతీయ నృత్యం, ప్రాంతీయ వంటకాలు, శాస్త్రీయ వేషధారణ, దేశంపై సామాజిక అవగాహన, సేవా కార్యక్రమాల నిర్వ హణపై నాలుగు రోజుల పాటు జరుగనున్న పోటీల్లో దేశంలోని 29 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొననున్నారు. మిసెస్ ఇండియా పోటీ నిర్వహణ ఆల్ ఇండియా డైరెక్టర్ దీపాలి ఫడ్నిస్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు పాటు వివిధ కేటగిరీల్లో ఎంపికైన మేరకు కేటగిరీల వారీగా టైటిల్స్ అందజేస్తారని పైడి రజని తెలిపారు.

తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా నరేష్

విశాలాంధ్ర–మందస: మండలం కొర్రాయిగేటు గ్రామానికి చెందిన గేదెల నరేష్ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియ మించారు. ఈమేరకు శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు నుంచి నియామక పత్రంను నరేష్ అందుకున్నారు. ఇందుకు కృషి చేసినా తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యే శివాజీ, రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, ఎంపి రామ్మోహనాయుడులకు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై తెలుగుదేశం పార్టీ గురుతర బాధ్యతను ఉంచినందుకు త్రికరణ శుద్ధిగా నేరవేరుస్తానని, పార్టీ విజయమే లక్ష్యంగా పని చేస్తానని నరేష్ అన్నారు

యువగళంతో మార్పు

విశాలాంధ్ర–ఇచ్ఛాపురం : ఆంధ్ర రాష్ట్రంలో ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటూ, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను వివరించి చైతన్య పరిచేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టే యువగళం పాదయాత్రతో రాష్ట్రంలో పెను మార్పులు చోటు చేసుకుంటాయని తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. యువ గళం పాదయాత్ర ప్రారంభోత్సవం నేపథ్యంలో శుక్రవారం పార్టీ కేడర్ ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా యాత్ర సజావుగా సాగాలని కోరుతూ ప్రార్థించారు. అధికార పక్షం ఆగడాలు ప్రజలు గమనిస్తున్నారని, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పాదయాత్రకు సంఘీభావంగా అమ్మవారి దేవాలయం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు నినాదాలు చేస్తూ నడక సాగించారు. పట్టణ పార్టీ అధ్యక్షులు కాళ్ళ ధర్మారావు ఆధ్వర్యంలో జరిపిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నాగరాజ్ పాత్రో, 3వ వార్డ్ కౌన్సిలర్ పత్రి తవిటయ్య, 22వ వార్డ్ కౌన్సిలర్ కాళ్ళ దిలీప్, పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా కార్యదర్శి 10వ వార్డ్ కౌన్సిలర్ ఆశి లీలా రాణి, ఎంపీటీసీ కాళ్ళ గోపి, జే.సంతోష్, సుభాష్ రౌలో, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు ఎం.డి జిలాని, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ళ జయదేవ్, బత్తిన కృష్ణయ్య, మాజీ ఎంపిపి దక్ష త ఢిల్లీ రావు, బి.లోహిదాసు, బోర ప్రసాద్, దక్షత కామేష్, మాజీ ఏం.ఎం.సి చైర్మన్ సాడి సహదేవ్, గిన్ని కేశవ రావు, ఖేత్రబసి బెహెర, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాల తనిఖీ

విశాలాంధ్ర ఇచ్ఛాపురం : స్థానిక కాదా లక్ష్మీకాంతం మున్సిపల్ బాలికోన్నత పాఠశాలను కమీషనర్ ఎస్.రమేష్, 9వ వార్డ్ కౌన్సిలర్ బల్ల జగన్‌లతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం గోరుముద్దలు అమలు తీరును పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు గగన కుమారితో మాట్లాడి అక్కడ ఏ సమస్యలు ఉన్నా తక్షణం కమీషనర్ దృష్టికి తీసుకురావాలని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోరుముద్దలు అమలులో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇరువురికి గాయాలు... ఐదు గొర్రెలు మృతి

ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర –కోటబొమ్మాళి : మండలం జాతీయ రహదారి జర్జంగి గ్రామ సమీపంలో గల గరీబుల గెడ్డవద్ద గురువారం అర్ధరాత్రి 2.40 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి గ్రామం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన దేవాడ తేజేశ్వరరావు (19) మృతి చెందగా విజయపట్నాయక్, సాయిసుమత్‌లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు మృతుడు తేజేశ్వరరావు తన స్నేహితులు విజయపట్నాయక్, సాయిసుమత్‌తో కలిసి ద్విచక్రవాహనం పై మడపాంలో ఉన్న తన స్నేహితుడును కలుసుకొని తిరిగి వస్తున్న సమయంలో గరీబులగెడ్డ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న గొర్రెలకు ఢీకొనడంతో ఈ ప్రమాధం జరిగింది. ఈ ప్రమాధంలో ఐదు గొర్రెలు మృతిచెందగా తీవ్ర గ్రాయాలైన తేజేశ్వరరావుతో పాటు గాయాలు అయిన వారి స్నేహితులను స్థానిక 108 సహాయంతో శ్రీకాకుళం అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ తేజేశ్వరరావు మృతి చెందాడు. అయితే అ సమయంలో మంచు ఎక్కువగా కురవడంతో ఎదురుగా వస్తున్న గొర్రెలు మంచుకు కనిపించకపోవడంతో ఈ ప్రమాధం జరిగిందని విజయపట్నాయక్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు సమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా తెలిపారు.

రాజగోపాలరావు శత జయంతిని అధికారికంగా నిర్వహించాలి

విశాలాంధ్ర–పలాస: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శుక్రవారం మధ్యాహ్నం అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కలిసి స్వర్గీయ బొడ్డేపల్లి రాజగోపాలరావు శత జయంతి ఉత్సవాలను (12.3.2023) రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. స్పీకర్ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నిర్ణయం పట్ల బొడ్డేపల్లి అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంఘీభావం

విశాలాంధ్ర–శ్రీకాకుళం టౌన్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగలం (పాదయాత్ర)లో భాగంగా శుక్రవారం కుప్పంలో జిల్లా టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం జిల్లా టీడీపీ అధ్యక్షులు కూన రవి కుమార్, టీడీపీ నాయకులు గౌతు శిరీష, మామిడి గోవింద రావు, గోండు శంకర్ తదితరులు పాదయాత్రలో పాల్గొని లోకేష్‌తో కలిసి నడిచారు.

ఎల్ఎన్‌పేటలో : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ యువగళం పాదయాత్రలో పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పాదయాత్ర లో పాల్గొని సంఘీభావం తెలిపారు. ముందుగా కుప్పంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో పాల్గొని నారా లోకేష్, ఎంపీ రాంమ్మోహన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు, యువతకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసేందుకే చేస్తున్న యువగళం మహా పాదయాత్రకు మద్దతుగా ఉంటూ పాతపట్నం నియోజకవర్గ ప్రజలకు చైతన్య పరిచి, పార్టీ గెలుపుకు ముందడుగు వేస్తానని తెలిపారు.

టెక్కలిలో : నారా లోకేష్ పాదయాత్ర మొదలు పెడుతున్న సందర్భంగా పాదయాత్ర సక్రమంగా ఎటువంటి ఆటంకాలు రాకుండా, ప్రతి అడుగులోనూ 2024 లో అధికారం వచ్చేవిధంగా అడుగులు పడాలని కోరుతూ టెక్కలి మండలం రావివలస లోని శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి వారి సన్నిధిలో టెక్కలి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి, ఎల్ ఎల్ నాయుడు దంపతులు, హనుమంతు రామకృష్ణ, మట్టా పురుషోత్తం, మామిడి రాము, మట్టా

సుందరమ్మా, బడే జగదీష్, ఇప్పిలి జగదీష్, దాసరి వాసు,నర్తు కృష్ణారావు, భుజంగారావు ,కోళ్ల కామేష్, రేయ్యి ప్రీతీష్ చంద్ర,మెండ దమయంతి, బెహరా ఖాళీ,దల్లి ప్రసాద్ రెడ్డి, పోలాకి షణ్ముఖ రావు, పరపతి చిన్నాయిరెడ్డి, మెట్ట చంద్ర రావు, బాగాది సునీల్, అన్నెపు వాసు, సోదిముడి కిరణ్,వంగ వసంత్, పంగ మన్మదారావు, సలాన వినోద్, బొడ్డేపల్లి లచ్చు, సంపత్తిరావు భాస్కర్ రావు, పేరా సాయి, కోరాడ రాంప్రసాద్, రాము, ఆవల శ్రీరాములు, బంగారు ఆదినారాయణ, బొల్లా యోగి, వాకాడ రవి, తురక వెంకటేష్, మంచాల సింహాచలం, గండేటి భీమారావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మాసానపుట్టి గిరిజనులకు న్యాయం చేయండి

తహశీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన సీపీఐ జిల్లా నాయకులు

విశాలాంధ్ర–బూర్జ: మండలంలోని హన్నుంపేట పంచాయతీ మాసానపుట్టి గ్రామంలోని గిరిజనులు తర తరాలుగా 70 నుంచి 80 ఎకరాల వరకు వారి సాగులో ఉన్న భూములను గిరిజనేతరులు ఆక్రమించుకొని మాకు పేటిపై హక్కు ఉందని, గిరిజనులను బెదిరిస్తూ పోలీసు స్టేషన్‌లో కూడా గిరిజనులపై ఫిర్యాదుచేసి గిరిజనులపై దుర్భాష లాడుతున్నారని, గిరిజనులకు తగు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి, సీపీఐ జిల్లా నాయకులు చాపర సుందర్‌లాల్, అల్లబోయిన అప్పలనాయుడు, మండల తహాశీల్దార్‌ను కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహాశీల్దార్‌కు స్థానిక గిరిజనులతో కలిసి గిరిజనుల పేరున ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలు అడంగల్ చూపించి సమస్యను తహాశీల్దార్ కు వివరించారు. దీనిపై తహాశీల్దార్ స్పందిస్తూ తక్షణమే సంబంధిత సిబ్బందితో భూ సర్వే నిర్వహించి వారం రోజుల్లో గిరిజనులకు న్యాయం చేస్తామని తహాశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి, సుందర్‌లాల్, అప్పలనాయుడులు మాట్లాడుతూ గిరి ప్రాంతాల్లోని భూములను తర తరాలుగా సాగు చేసుకుంటున్న గిరి రైతులపై కొందరు కావాలనే ఆ భూములను ఆక్రమించి వారి పలుకుబడి ఉపయోగించి గిరిజనులకు భయభ్రాంతులకు గురి చేయడం భాధాకరమన్నారు. గిరిజనుల సాగులో ఉన్న భూములు గిరిజనులకే చెందుతాయని, గిరిజనేతరులకు అక్కడ భూములు ఎలా వస్తాయని వారు ప్రశ్నించారు. గిరిజనుల పక్షాన సీపీఐ పోరాడుతుందని బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన సీపీఐ ఉంటుందని, గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్ట దుర్గారావు, బాధిత గిరిజనులు కె. చిరంజీవులు, పాలక రాము, కె. కద్రయ్య, నిమ్మక అప్పారావు, పెద్దఎత్తున గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తిగా ఉన్నారు : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర–కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. గడపగడపకు వెళుతుంటే ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందని చెబుతున్నారని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం మండలం లఖందిడ్డి పంచాయతీ లఖందిడ్డి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్సీ ఇంటింటికి తిరిగారు. గత మూడేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేస్తూ లబ్ధిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా దువ్వాడ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జీ గడ్డవలస నాగభూషణరావు, స్థానిక సర్పంచ్ బమ్మిడి గణపతి స్వామి, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజారామక్రిష్ణ, సర్పంచ్‌లు కాళ్ళ సంజీవరావు, బలగ సూర్యరావు, జిల్లా రైతుభరోసా అడ్వైజరీ కమిటీ సభ్యులు కవిటి రామరాజు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కోటబొమ్మాళి మండల ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో జరిగిన డాక్టర్ వైయస్సార్ సంచార పశు వైద్యశాల వాహనంను ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, పశువైద్యాధికారి ఎల్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బైపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర–వజ్రపుకొత్తూరు: మండలం బైపల్లి పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ డొంక ఉషా తెలిపారు. ఈ కార్యక్రమంనకు రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు హాజరవుతారని, కనుక మండల వైసీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

30న పలాస మున్సిపల్ సాధారణ సమావేశం

విశాలాంధ్ర–పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ సాధారణ సమావేశం కౌన్సిల్ మందిరంలో ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరు హాజరుకావాలని కోరారు.

సంచార జాతులకు సర్కారు మొండి చెయ్యి

విశాలాంధ్ర–పొందూరు : రాష్ట్రంలో నేతలెందరు మారినా సంచార జాతులకు సర్కారు మొండిచేయే తప్ప ఆదరించే నాథుడు లేదని సంచార కుటుంబానికి చెందిన సబ్బవరం అప్పన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ జీవితాలకు భిక్షటన తప్ప సర్కారు చేయూత ఏనాడు లేదని వాపోతున్నారు. తరతరాలుగా పార్టీలు ఏన్నయినా,నేతలు ఎందరు వచ్చినా తమ ఓట్లు దొంగిలించడమే తప్ప తమ కుటుంబాలు బాగుపడే గడియలు కనిపించడం లేదని కన్నీటి ఘోష వినిపిస్తున్నారు. ఎన్నికలు ముందు రంగు, రంగుల జెండాల పట్టుకుని కల్లబొళ్ళు కదలచేప్పి సంగనాచి మాటలతో నేతల మోసాలకు మోసపోతున్నామని బాధను వెలబుచ్చుతున్నారు. మా సంచార జాతులకు సర్కారు పథకాలు అందని దూరంలో ఉన్నాయంటున్నారు. తరతరాలుగా తమ కుటుంబాలు సర్కారు పథకాలు నోచుకోలేని దౌర్భాగ్య పరిస్థితి మాది అంటూ కలత చెందుతున్నారు. ఇంటింటా అడుక్కొని బ్రతకడమే తప్ప – సర్కారు చేయూత తమకు అందడం లేదు కలత చెందుతున్నారు. ఇదు పేదల ప్రభుత్వమని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప సర్కార్ నుండి ఒరిగేది లేదంటూ కలత చెందుతున్నారు. ప్రజలిచ్చే అర్ధా రూపాయితో కడు కష్టంగా బ్రతుకుతున్న సంచార కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుని అందరితో సమానంగా మమ్మల్ని చూడాలంటూఆయన కోరుతున్నారు.

కళ్యాణి స్కూల్లో ముందస్తు రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర–కవిటి: మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద నేడు రథసప్తమి సందర్భంగా ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఉపాధ్యాయులు రాము ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు అభ్యసన కార్యక్రమం విద్యార్థులచే నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు రథసప్తమి, సూర్య నమస్కారాలు యొక్క విశిష్టత ప్రిన్సిపల్ పండి బిందుమాధవి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చిన్ననాటి నుంచే సూర్య నమస్కారాలు అభ్యాసన వల్ల శారీరిక,మానసిక శక్తి కలిగి ఆరోగ్యంతో పాటు తెలివితేటలు పెరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె భవనం కావలెను

కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రారు కార్యాలయం నిర్వహించేందుకు మున్సిపాలిటీ పరిధిలో 2000 చదరపు అడుగులు వైశాల్యం గల భవనం అద్దె కొరకు కావాలెను. అద్దెకు ఇచ్చే భవన యాజమానులు తవిటయ్య సబ్‌రిజిస్ట్రారు సెల్ నెం.79815 19467కు సంప్రదించవలెను.

తాగునీటి సమస్య లేకుండా చూడండి : ఎంపీపీ ఈశ్వరమ్మ

విశాలాంధ్ర-మెళియాపుట్టి: రానున్న వాసవికాలం దృశ్య గ్రామాలలో ఎక్కడ త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీపీ రానా ఈశ్వరమ్మ అన్నారు. మండలధ్యక్షురాలు రానా ఈశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాలలో జరుగుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు అనుమతులు ఉన్నాయా? లేవా? అని దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని మర్రిపాడు ఎంపిటిసి ప్రతినిధి బాబురావు సమావేశంలో ప్రశ్నించారు. దీనిపై తహసిల్దార్ సరోజిని మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న నాలా కన్వర్షన్ కు సంబంధించి వివరాలు ఉన్నాయన్నారు. దీనబంధుపురం జగనన్న కాలనీ పక్కనే ఓ వ్యక్తి రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా పెద్ద లక్ష్మీపురం సర్పంచ్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు సమావేశాలు నిర్వహించేటప్పుడు ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం అందించాలన్నారు. గొప్పిలి సర్పంచ్ ప్రతినిధి పల్లి యోగి మాట్లాడుతూ సుమారు 15 మందికి 9 నెలలు కాలముగా ఉచిత రేషన్ రావడంలేదని అనేకమార్లు ఇదే విషయమే తెలియపరచినప్పటికీ ఎటువంటి మార్పు లేదని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వర్ రావు మాట్లాడుతూ గ్రామంలో పలువురికి రేషన్ సరుకులు డీలర్ ఇవ్వడం లేదని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తాహసిల్దార్ సరోజిని మాట్లాడుతూ మండలంలో ఇటువంటి సమస్యలు ఎక్కడున్నా వాటి పై పరిష్కార చర్యలు చేపడతామన్నారు. గేదెల పోలూరులో నిర్మాణం చేపట్టిన అంగన్వాడి భవనానికి సంబంధించి నిధులు వెనక్కి వెళ్లిపోయాయని సకాలంలో బిల్లులు జరిగేలా చర్యలు చేపట్టాలని దీనబంధుపురం సర్పంచ్ ప్రతినిధి వెంకటేష్ సభ దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా పలు గ్రామాలలో అంగన్వాడీ భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని సభ్యులు దీనిని దృష్టిలోకి తీసుకెళ్లగా దానిపై పరిశీలన చేస్తామని సారవకోట సిడిపిఓ కామాక్షి అన్నారు. అనంతరం ఎంపీపీ రానా ఈశ్వరమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా అధికారులు పనిచేయాలని, వారం రోజుల్లో మండలంలోని రహదారులు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆర్అండ్బి ఏఈ ఎన్.ఎల్ నాయుడును సూచించారు. ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా అధికారులు గ్రామాలలో కార్యక్రమాలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో కొన్ని శాఖలకు సంబంధించి చర్చ జరగలేదు. మండలంలో తహసిల్దార్ సరోజిని, వ్యవసాయధికారి దానకర్ణుడు, మండల పరిషత్ సీనియర్ సహాయకులు తిరుపతిరావు పట్నాయక్ తదితర ఎనిమిది మంది రిపబ్లిక్ డే నాడు అవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఈశ్వరమ్మతో పాటు పిఏసిఎస్ అధ్యక్షుడు బాలరాజు, ట్రైకార్ డైరెక్టర్ సవర ఈశ్వరమ్మ, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అలికాన మాధవరావు, ఎంపీడీవో చంద్రకుమారి, తాసిల్దార్ సరోజిని, ఏవో దానకర్ణుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, వివిధ శాఖధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి కాంగ్రెస్‌ను బలపరుద్దాం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద పాలనను కొనసాగిస్తుందని అదే విధంగా రాష్ట్రంలో సీఎం జగన్మోహన్రెడ్డి సారథ్యంలో ప్రజా కంటక పాలన సాగుతోందని ఈ రెండు ప్రభుత్వాలను గద్దె దింపాల్సిన అవసరం ఎంతో ఉందని పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. భారత్ జోడో యాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఏడురోడ్ల కూడలి ఎన్టీఆర్ మైదానం నుంచి ఇందిరా విజ్ఞాన్ భవన్ వరకు పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. చేయిచేయి కలుపుదాం ... కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం... రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశ సమగ్రత సమైక్యతకు పునరంకితమవుదామంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇందిరా విజ్ఞానభవన్ వద్ద పీసీసీ చీఫ్ గిడుగు రుద్ర రాజు విలేకర్లతో మాట్లాడారు. పేద బడుగు, బలహీన వర్గాలకు దళితులకు యువతకు యుపిఏ ప్రభుత్వంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ సోనియాగాంధీ సారథ్యంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 350 కిలోమీటర్లు పూర్తి చేసి ముగింపుపాలన చేసిన సందర్భంగా జిల్లాలో అన్ని గ్రామాల్లోనూ విస్తృత పర్యటన చేపడుతూ కాంగ్రెస్ భావాజాలాన్ని సిద్ధాంతాలను ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే విశాఖపట్నంలో లాంఛనంగా గురువారం ప్రారంభించామని రెండో రోజు శ్రీకాకుళంలో నిర్వహించినట్లు వారు వివరించారు. ఎంతో మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న మూడు కోట్ల టర్న్ వర్లో ఉన్న స్టీల్ ప్లాంట్ను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మేసే కుట్రలకు పాల్పడుతుందని దీనిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అదే విధంగా రాష్ట్రంలో పాలనపై అవగాహన లేని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో పది లక్షల కోట్లు అప్పులతో శతమతమవుతోందని పంచాయితీరాజ్ వ్యవస్థను ముఖ్యమంత్రి పూర్తిగా నిర్వీర్యం చేసారన్నారు. ఉద్యోగులకు సైతం సకాలంలో జీతాలు పెన్షన్లు చెల్లించుకోలేని స్థితిలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి జగన్మోహన్రెడ్డి విధానాలు కారణంగా దివాళ స్థితిలో ఉందని ఈ నేపథ్యంలో వారు గవర్నర్ను కలవాల్సిన దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేసారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి, నాయకులు క్రిస్టోఫర్ తిలక్, రాజేష్ రెడ్డి గోవిందమల్లిబాబు, అంబటి కృష్ణ, సనపల అన్నాజీ, రెల్ల సురేష్, కె.విఎల్. ఈశ్వరీ, పేడాడ పరమేశ్వరరావు, కొత్తకోట సింహాద్రినాయుడు, తెంబూరు మధుసూధనరావుతోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ పథకాలు సంబంధిత లేబర్ కార్యాలయం ద్వారా అందించాలని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీనివాసరావు కోరారు. ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. కరోనా కష్టకాలం నుంచి ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు ప్లంబర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదు ర్కొంటు న్నామని ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి చేయూత అందించాలని కోరారు. ప్రతి ఏటా జనవరి 27వ తేదీన ఎలక్ట్రీషియన్ డే గా జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రైవేట్ ఎలక్ట్రికల్ ప్లంబర్ కార్మికులకు 1850లో జనవరి 27వ తేదీన థామస్ ఆల్వా విద్యుత్ బల్బును కనిపెట్టారని ఆ రోజును ఎలక్ట్రిషన్ రోజుగా కార్మికులం జరుపుకుంటున్నామని వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క ఎలక్ట్రిషన్ కార్మికులకు అందేలా చూడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎ చంద్రశేఖర్, కె హరి, డిఎజి రమణ, ఏ రవి. తేజ. అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విజయవంతమైన వైద్య శిబిరం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటలో హృదయం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా వైద్య శిబిరం అలాగే రక్తదాన శిబిరం విజయవంతమైంది. జెమ్స్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 400 మంది రోగులు హాజరయ్యారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యుడు రోగులను తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం ద్వారా రక్తాన్ని సేకరించారు. 40 మంది యువకులు స్వచ్ఛందంగా శిబిరానికి హాజరై రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో హృదయం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కర్రి మిన్నారావు, అధ్యక్షులు దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. రక్తదానానికి ముందుకొచ్చిన యువకులను అభినందించారు.

గణతంత్ర వేడుకల్లో 'ఐతమ్' విద్యార్థుల ప్రదర్శన

విశాలాంధ్ర-టెక్కలి: భారత 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జెఎన్టియుజివి 'పేట్రియాటిజమ్ అండ్ నేషనల్ బిల్డింగ్' అనే అంశంపై నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని అద్భుత ప్రదర్శన చేసి ద్వితీయ బహుమతిని సాధించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ వేడుకల్లో పాల్గొనే అరుదైన అవకాశం తమ కళాశాల విద్యార్థులకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఈ మేరకు జెఎన్టియు జివి రిజిస్ట్రార్ డాక్టర్ జి.స్వామినాయుడు, ఆర్ అండ్ డి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.బాబులు విద్యార్థుల ప్రదర్శనను మెచ్చుకొని జ్ఞాపికలను అందజేశారన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాస రావు, పలు విభాగాల హెచ్.ఓ డి లు, సాంస్కృతిక విభాగ కన్వీనర్ డాక్టర్ సి. హెచ్ రాజశేఖరరావు తదితరులు అభినందించారు.

ఘనంగా 34వ రోడ్డు భద్రత వారోత్సవాలు

విశాలాంధ్ర-టెక్కలి: 34వ రోడ్డు భద్రత వారోత్సవాలను టెక్కలి డిపోలో అసిస్టెంట్ మేనేజర్ బి ఎస్ ఎన్ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంజీవరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది ప్రతి పౌరుని యొక్క బాధ్యతని, రోడ్డుపై ప్రయాణించి క్షేమంగా ఇంటికి చేరడం అనేది ప్రతి ఒక్క వ్యక్తి తప్పక పాటించవలసిన అంశం అని తెలిపారు.రోడ్డు భద్రతపై అనేక సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రామారావు,అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.ఎం.రావు,జి ఎన్ భూషణం,బి.ఎం.మురళి మరియు డ్రైవర్లు కండక్టర్లు మెకానిక్ లు సెక్యూరిటీ సిబ్బంది తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో లోక కళ్యాణార్థం విశ్వశాంతి హోమం

విశాలాంధ్ర - జలుమూరు : మండలం శ్రీముఖలింగంలో ఒడియా బ్రాహ్మణ వీధిలో ఫిబ్రవరి 1 బుధవారం ఒరియా బ్రాహ్మణ వీధిలో భీష్మ ఏకాదశి రోజున లోక కళ్యాణార్థము విశ్వశాంతి హోమం వర్లాకిమిడి రుద్వికులు ఆధ్వర్యంలో కడురమ్యంగా నిర్వహించబడునని ఆలయ ప్రధాన అర్చకులు నాయుడుగారి రాజశేఖర్ తెలిపారు. ఈ యజ్ఞము సర్వ మానవాళి ప్రజలంతా సిరిసంపదలు భోగ భాగ్యాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లేందుకు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రైవేట్ పాఠశాలకు తాళ్లవలస విద్యార్థులు

- దిగజారుతున్న విద్యా ప్రమాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - ఆమదాలవలస: మండలంలోని జొన్నవలస పంచాయతీ పరిధి తాళ్లవలస విద్యార్థులు ప్రభుత్వ విధానాలకు విసుగు చెంది ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. మండల ప్రాథమిక పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు గతంలో ఉండేవారు. రోజురోజుకీ విద్య ప్రమాణాలు పడిపోవడంతో ప్రైవేట్ పాఠశాల క్యూ పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం అధికారుల వైఫల్యం కారణంగా విద్యార్థులు వలస బాట పడుతున్నారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయులకు స్థానికులకు మధ్య పాలకులు సమన్వయం చేయాల్సి ఉండగా అందుకు భిన్నంగా వ్యవహరించడంతో ఈ దుస్థితి ఏర్పడింది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుని వైఖరి సరిగా లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాల పరికరాలను, విద్యుత్ మోటార్లను ఉపయోగిస్తామని తనపై ఒత్తిడి తెస్తున్నారని, ఒప్పుకోకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారని ఉపాధ్యాయుడు అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ విద్య బుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు, వారిని సక్రమ మార్గంలో నడిపించే పాలకులు సమన్వయంతో వ్యవహరించిన నాడే వ్యవస్థ బాగుపడుతుందని కొందరు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనై మండల విద్యాశాఖ అధికారి పర్యవేక్షణ కరువైందని దీంతో ఈ పరిస్థితి దాపురించి ఉండొచ్చు అని అనుమా నాలు వ్యక్తం అవుతుంది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలన్న ఆశయంతో ఎన్నో పథకాలను రూపొందించి అందిస్తున్నప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి దాపురిస్తుంది.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు.. నిత్యం అసభ్యంగా వ్యవహరించే ఎస్ కిరణ్ కుమార్ మాస్టర్ మాకొద్దని తాళ్లవలస విద్యార్థులు తల్లిదండ్రులు అంటున్నారు. ఉపాధ్యాయుని మారిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరుస్తామని తల్లిదండ్రులు అంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి 16 మంది విద్యార్థులు ఉండేవారని ఇప్పుడు ఆ సంఖ్య ఆరుగుపడిపోయింది. పాలకులు అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే పరిస్థితి చక్క బడుతుందని తెలుస్తుంది.

గ్రామానికి తాగునీరు అందించాలన్నారు.. గ్రామస్తులంతా పాఠశాల మోటార్ ద్వారా తాగునీరు ప్రతిరోజు సరఫరా చేయమని ఒత్తిడి చేశారని అది కాదన్నందుకే నాపై నిందలు వేస్తున్నారని తాళ్లవలస పాఠశాల ఉపాధ్యా యుడు కిరణ్ కుమార్ తెలిపారు. టైం కి ప్రతిరోజు వస్తున్నానని చివరి బెల్లు కొట్టి న తరువాతే విద్యార్థులను ఇంటికి పంపించి నేను మా స్వగ్రామానికి వెళ్తున్నానని స్పష్టం చేశారు.

ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి డి రామారావును వివరణ కోరగా ఉపాధ్యాయునిపై ఫిర్యాదులు వచ్చాయని దానిపైన పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నానని తెలిపారు. ఇటీవల విద్యార్థులతో పనులు చేస్తున్న దానిపై విద్యార్థులు పాఠశాల సమయం తరువాత మాస్టారు ఇంట్లో పనులు చేశామని విద్యార్థులు స్వయంగా రాసి ఇచ్చారని ఎంఈఓ రామారావు తెలిపారు.

సోంపేట టు సారవకోట

సుదూర మిల్లులు కేటాయింపుపై ధాన్యం రైతుల ఆగ్రహం

విశాలాంధ్ర-సోంపేట : ఆరుగాలం శ్రమించి భారీగా పెట్టుబడులు పెట్టి ఎట్టకేలకు చేతికొచ్చిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. పారదర్శకంగా అవినీతికి తావులేకుండా మార్కెట్ ధరకే రైతులు విక్రయించుకునేలా ప్రభుత్వం తీసుకు వచ్చిన ధాన్యం సేకరణ విధానం లోపభూయిష్టంగా మారింది. సోంపేట మండలానికి చెందిన రైతుల ధాన్యాన్ని సారవకోట, నరసన్నపేట, సంతబొమ్మాళి తదితర మండలాల్లో ధాన్యం మిల్లులకు తరలించాలని అధికారులు చెప్పడంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుంది. సుమారు 70నుంచి 80కిలోమీటర్ల దూరంలో గల మిల్లులకు తీసుకెళ్లడం తమవల్ల కాదంటూ రైతులు స్పష్టం చేయడంతో అధికారులు సైతం ఇరకాటంలో పడక తప్పడంలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా సోంపేట, కంచిలి పరిసరాల్లో గల ధాన్యం మిల్లులు కేటాయించడంలో బ్యాంకు గ్యారెంటీలు సరిపడే విధంగా లేవంటూ సుదూర ప్రాంతాల మిల్లులు కేటాయించడం రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే మండలంలో రైతుల పొలాల్లో ధాన్యం బస్తాలు, వరికుప్పలు ఇంకా అలాగే మూలుగుతున్నాయి. వాటిని మిల్లులకు తరలించి ప్రభుత్వానికి ఎలా విక్రయించాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. సందిగ్ధంలో పడ్డ రైతులు ఆయా శాఖల ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదులు చేస్తున్నా సరైన స్పందన లేకపోవడం రైతులను మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తుంది ప్రభుత్వం తీసుకువచ్చిన విధానంపట్ల రైతన్నలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 15తో ధాన్యం కొనుగోళ్లు ముగిస్తామని ప్రభుత్వం పేర్కొనడం పట్ల రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికే దాదాపుగా 50శాతంకు పైగా రైతులు ధాన్యం విక్రయించుకోవల్సి ఉంది. ఏమి చేయాలో పాలుపోని పరిస్థితుల్లో రైతన్నలు లబోదిబోమంటున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రులు ఇటువంటి సమస్యపై వీలైనంత త్వరగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

వంద రోజుల పని దినాలపై ప్రత్యేక దృష్టి సారించండి

డ్వామా పిడి చిట్టి రాజు

విశాలాంధ్ర-గార: క్షేత్రస్థాయిలో వందరోజుల పనిదినాలపై సిబ్బంది ప్రత్యేక దృష్టిని సాధించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జీవి చిటిరాజు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం శ్రీకాకుళం మండల పరిధిలోని వొమ్మనుబందరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సిబ్బంది గరిష్ట వేతనం పొందేందుకు గాను సమయపాలన పాటిస్తూ రెండు పూటలా పనులు చేయాలని కోరారు. చేస్తున్న పనిని మీ సొంత పనులుగా భావించాలని, నాణ్యతతో పనులు చేపట్టాలని అన్నారు. కూలీలకు గరిష్ట వేతనం పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బంది ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. సగటు వేతనం రూ. 250 రావడమే ధ్యేయంగా విధులు నిర్వహించాలన్నారు. ఈ పర్యటనలో పీడీ వెంట ఏపిఓ సీతారాం, జేఈవి బాల ముకుంద బాబు, టి.ఎ.రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో ఎమ్.జి.ఆర్... పాతపట్నం దేశం టికెట్ ఆశావహులు!

విశాలాంధ్ర-కొత్తూరు : చిత్తూరు జిల్లా కుప్పం నుండి శుక్రవారం ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగలం పాదయాత్రలో పాతపట్నం నియోజకవర్గం నుండి రాబోయే ఎన్నికల్లో దేశం టికెట్ ఆశిస్తున్న ప్రముఖ సామాజికవేత్త మామిడి గోవిందరావు పాల్గొనడం స్థానిక ఆ పార్టీలో చర్చకు దారితీసింది. పాతపట్నం నుండి దేశం సిటింగ్ అభ్యర్థిగానున్న మాజి ఎమ్మెల్యే కలమట వేంకట రమణ మరోసారి రాబోయే ఎన్నికల్లో పోటీ చేయాలన్న నిర్ణయంతో ఉన్నారు. పార్టీ నియోజకవర్గ ఇంఛార్జిగా కూడా కలమట వ్యవహరిస్తున్నారు. కాగా ఈ నియోజకవర్గం నుండి సామాజిక వేత్త ,వితరణ శీలిగా పేరుపడ్డ మామిడి గోవింద్ రావు కూడా పాతపట్నం నుండి తెలుగుదేశం టికెట్ ఆశిస్తున్నారు.ఆశించడమే కాదు తానే అభ్యర్థి నంటూ మామిడి బహిరంగంగా చెప్తున్నారు.అంతే కాదు నియోజ కవర్గం పార్టీ ఇంఛార్జి కలమాట పై విమర్శలు తో అప్పుడప్పుడు విరుచుకుపడుతున్నారు, తరుచూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తో కలుస్తున్నారు, పార్టీ కి కొంత ఫండ్ కూడా ఇచ్చారు, నియోజకవర్గ పరిధిలో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పాటుచేసే దిశగా ఎం.జి.ఆర్ ముందుకు సాగుతున్నారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రోజు, రోజు కు ఆయన దూకుడు పెంచడంతో మాజీ ఎమ్మెల్యే కలమాట అనుచరులు, పార్టీ నాయకులు కొందరు కొద్ది రోజుల క్రితం టీడీపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చం నాయుడు ని కలిసి ఎంజిఆర్ రాజకీయ వ్యవహార శైలి పై ఫిర్యాదు చేశారు. ఇప్పుడు యువ గళం పేరుతో 400 రోజు ల సుదీర్ఘ పాదయాత్ర కు శ్రీకారం చుట్టి న టీడీపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభ రోజు న కుప్పం నుండి ఎంజిఆర్ కూడా లోకేష్ వెంట నడవడం తో ఈ పరిణామం ఆ పార్టీ లో చర్చ కు ఆస్కారం జరిగింది. .పాతపట్నం నుండి రాబోయే ఎన్నికల్లో సిటింగ్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కలమాట పోటీ చేయాలన్న దృఢ నిచ్చయం తొ ఉండగా ,అదే స్థాయి లో ప్రముఖ సామాజిక వేత్త మామిడీగోవింద్ రావు కూడా దేశం టికెట్ కై కలమాట తో పోటీ పడుతున్నారు. మరి పాతపట్నం నియోజకవర్గంలో టీడీపీ అధిష్టానం ఎవరి వైపు మొగ్గ చూపుతోందో వేచి చూడాలి.

లోకేష్‌కు పాదయాత్ర చేసే అర్హత లేదు

- పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో చెప్పాలి
- ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తెలియజెప్పాలి
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

విశాలాంధ్ర-అరసవల్లి: నారా లోకేష్‌కు పాదయాత్ర చేసే అర్హత లేదని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరిని మోసం చేయడానికి పాదయాత్ర ప్రారంభించారో చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్ర చేయడం ద్వారా సీఎం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, ఆయనలాగే పాదయాత్ర చేసి సీఎం కావాలనుకోవడం చంద్రబాబు, లోకేష్ లు పగటి కలలు కనడమేనని చెప్పారు. 3400 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రతో జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారని గుర్తు చేశారు. రాజధాని పేరుతో 33 ఎకరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు మీ నాన్న చంద్రబాబు వన్నాగం పన్నారన్నారు. ఐదేళ్లలో ఐదు కల్యాణ మండపాలు మాత్రమే నిర్మించి ఇదే రాజధాని నిర్మాణాలు అంటూ చెప్పిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. టిడిపికి దశా దిశా లేదన్నారు. పాదయాత్ర చేయడానికి మీకున్న అర్హత ఏంటి అని ప్రశ్నించారు. నువ్వు సీఎం అభ్యర్థివా అంటూ ధ్వజమెత్తారు.

సీఎం జగన్మోహన్ రెడ్డిని ఎన్నికల క్షేత్రంలో ఎదుర్కోలేకే గుంపులుగా జోడీలు కట్టి వస్తున్నారని అన్నారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా సీఎం జగన్మోహన్ రెడ్డి వైపే ప్రజాభిమానం ఉందని ఈ సందర్భంగా చెప్పారు. అసలు టిడిపి 175 స్థానాల్లో పోటీ చేస్తుందా? ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ కి 50 స్థానాలుకి అవకాశం ఇస్తారా? అన్నది చెప్పాలన్నారు. 50 స్థానాల్లో జనసేనకు అవకాశం ఇస్తే ఆ నియోజకవర్గంలోని టిడిపి అభ్యర్థుల పరిస్థితి ఏంటి అని అడిగారు. మీరు అధికారంలోకొస్తే సచివాలయ, వాలంటరీ వ్యవస్థలను రద్దు చేస్తారా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకొస్తే సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకెళ్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెబుతున్నారు. అంటే సంక్షేమ పథకాలు బాగున్నాయని ఒప్పుకున్నట్టే కదా మరి నీ పాదయాత్ర ఇప్పుడు ఎందుకు అని విమర్శించారు. కేవలం టిడిపి ఉనికి చాటుకోవడానికే పాదయాత్ర ప్రారంభించారని ప్రజలు ఇప్పటికే గ్రహించారని వివరించారు.

అచ్చెన్నాయుడు ఎక్కడ? పార్టీ లేదు.. ఏమీ లేదు అంటూ నీచంగా మాట్లాడిన అచ్చెన్నాయుడు పాదయాత్ర ప్రారంభించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాలుగేళ్లలో నియోజకవర్గ సమస్యలపై ఎంత మేర దృష్టి సారించారో అచ్చెన్నాయుడు చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు అచ్చం నాయుడు ఎక్కడున్నాడు అంటూ దువ్వాడ శ్రీనివాసరావు ప్రశ్నించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర చారిత్రాత్మకమైనదని తెలిపారు. మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన హామీలను 98 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు.

యాధేచ్ఛగా కంకర తవ్వకాలు... చోటా నాయకులతో ఆదిపత్యం..!

విశాలాంధ్ర-కాశీబుగ్గ : పలాస నియోజకవర్గంలో ప్రకృతి సంపదను గుల్ల చేస్తున్నారు. భవిష్యత్ తరాలకు కొండలు లేకుండా చేసి నిరాశే మిగుల్చుతున్నారు. పలాస కాశీబుగ్గ జంట పట్టణాల చుట్టు ఉన్న కొండలలో భూ బకాసురులు కంకర తవ్వకొని పోతూ వాటిని నామరూపాలు లేకుండా చేస్తున్నారు. ప్రతి రోజు వందలాది ట్రాక్టర్లుతో, లారీలతో కంకర తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. వెంటిభద్ర సర్వే నెం.298, కొసంగిపురం సర్వేనెం.148, సూదికొండ సర్వే నెం.51, నెమలికొండ సర్వే నెం.346లో కంకర తవ్వకాలు జోరుగా కొనసాగుతున్నాయి. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాలైన బొడ్డపాడు, అనంతపురం, బెండికొండలను సైతం అక్రమార్కులు వదల బొమ్మాళి... వదలా... అంటూ తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. రాత్రులు యంత్రాలతో తవ్వకాలు చేపట్టి తెల్లారే సరికి కొండను దొలి చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో భవన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అపార్టుమెంట్లు, గోదాములు, వాణిజ్య సముదాయాలు, నిర్మాణాలతో పాటు రహదారులు నిర్మాణాలకు కంకర చాలా అవసరం. దీనిని గుర్తించి ఊసరవెల్లి నాయకులు కొంత మంది ఇళ్లు ఉండగానే చక్కదిద్దుకోవాలనే చందంగా కంకరను బాహాటంగా విక్రయించి రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు దర్జాగా కానిస్తున్నారు. ఇలా సేకరించిన కంకరను రియల్ ఎస్టేట్ భూముల్లో వేస్తూ సొమ్ములు చేసుకుంటున్నారనే ప్రచారం జోరుగా వినిపిస్తుంది. ఒక ప్రధాన పార్టీ నాయకుల అండదండలతో ఈ తతంగం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. వీరిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు ఏ మాత్రం కనిపించడం లేదు. గత ఎన్నికలకు ముందు అధినాయకుని చెంతకు చేరిన ఒక సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు అన్ని కార్యకలాపాల్లో తలదూర్చుతూ తామే చెప్పిందే వేదంగా చలామణి అవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు అధినాయకునికి వ్యతిరేకించిన వీరికి అగ్రతాంబులం ఇవ్వడంతో కొంత మంది చోటా నాయకులు మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. కంకర వీరులు అధిపత్యాన్ని గండి కొట్టకపోతే రాబోయే ఎన్నికలకు వీరి వలన కొంత నష్టం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

యువగళం విజయం కావాలని ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ యువతకోసం చేపట్టిన యవగళం పాదయాత్ర కార్యక్రమం విజయవంతం కావాలని స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు బోయన రమేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని, యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేష్ 400 రోజులు 4వేలు కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారని,ఈ కార్యక్రమానికి ఎటువంటిఆటంకాలు లేకుండా విజయవంతం కావాలని కోరుకుంటూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ మాజీ జడ్పీటీసీ నంబాల శ్రీను, కర్రి అప్పారావు, కోరాడ గోవింద, దేవాది సింహాద్రమ్మ, గొండు లక్ష్మణరావు, బి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహకారం అందించిన 'సిరిపురం'

విశాలాంధ్ర-మెళియాపుట్టి : బాణాపురం గ్రామానికి చెందిన సవర మోహన్ రావు కుమార్తె ఇటీవల కాలంలో అగ్ని ప్రమాదానికి గురైన చిన్నారి ఉమశ్రీ కుటుంబానికి నియోజకవర్గ నాయకులు, విద్యావేత్త సిరిపురం తేజేశ్వరరావు ఆర్థిక సహకారాన్ని అందించారు. మెళియాపుట్టి మండలంలో గల బాణాపురం పంచాయతీ సవర బాణాపురం గ్రామానికి చెందిన సవర మోహన రావు కుమార్తె ఉమాశ్రీ ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న విద్యావేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వర రావు శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించి, ఆ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి చిన్నారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసు కున్నారు. ఆ చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతుగా కొంత ఆర్థిక సహకారాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భనలో తేజేశ్వరరావుతోపాటు సరాళి సర్పంచ్ పడాల షణ్ముఖరావు, పైల భాస్కరరావు, నాగులపల్లి నాగేశ్వర రావు, సిరిపురం మిత్ర బృంద సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో మూడు స్లీపర్ బోగిలే..!

విశాలాంధ్ర-పలాస : ఆధునీక వసతుల పేరుతో సాధారణ మధ్యతరగతి ప్రయాణీకులకు రైల్వే శాఖ అన్యాయం చేస్తుందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే పలు రైలుల్లోని స్లీపర్ బోగిల్లో సీట్లు సరిపడక ప్రయాణీకులు నిరీక్షణ జాబితా టిక్కెట్లుతో నిలబడి ప్రయాణాలు సాగిస్తున్నారు. వారికి అదనపు బోగీలు అందుబాటులోకి తీసుకొచ్చి కష్టాలు తీర్చాల్సిన రైల్వే శాఖ ఆ బోగీల్లో మరింత కోత విధిస్తోంది. ఎల్.హెచ్.బి బోగీలుగా మార్పు చేసిన పలు రైలుల్లో కనీసం 2 నుంచి 4 చొప్పున స్లీపర్ బోగీల్లో కోతలు విధిస్తోంది. తాజాగా పలాస మీదుగా నిత్యం రద్దీతో నడిచే భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలుల్లో 9 స్లీపరు బోగీలను తొలగించి కేవలం మూడు స్లీపర్ బోగీలను మాత్రమే రైల్వే శాఖాధికారులు అందుబాటులో ఉంచారు. వాస్తవానికి గతేడాది సెప్టెంబరులోనే కోత విధించడానికి అధికారులు ఉపక్రమించగా ప్రయాణీకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో ఈ ఏడాది జనవరి 19 నాటికి వాయిదా వేసుకున్న రైల్వే అధికారులు అనుకున్న ప్రకారం మూడు స్లీపర్, 10 థర్డ్ ఎ.సి, 4 సెకండ్ ఎ.సి, ఒక ఫస్ట్ ఎ.సి కమ్ సెకండ్ ఎ.సి, రెండు సాధారణ బోగీలు, ఒక సాధారణ కమ్ లాగేజీ కమ్ దివ్యాంగుల బోగీ, ఒక పవర్ కార్ బోగీతో రైలును అందుబాటులోకి తీసుకురావడంతో ప్రయాణీకులకు తలనొప్పిగా తయారైంది.